క్లుప్తంగా

20న దేవాలయ షాపులకు వేలం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద షాపులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, టీ, టిఫిన్, కూల్‌డ్రింక్‌లు, తినుబండారాలు అమ్ముకునే హక్కు, పెండ్లిమండపం ఏర్పాటు, జనరేటర్‌పై లైటింగ్ వేసుకునే హక్కుకు రూ.25 వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. కొబ్బరికాయలు పోగు చేసుకునే హక్కు, ఐస్‌క్రీమ్ అమ్ముకునే హక్కు, సోడా అమ్ముకునే హక్కు, బొమ్మల అంగడి ఏర్పాటుకు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకూ సంవత్సర కాలం లీజు హక్కు ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీ దేవాలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. హెచ్చు పాటదారుడు పాడుకున్న మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనే వారు దేవాలయానికి ఎటువంటి బకాయిలు కలిగి ఉండటం, లావాదేవీలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రతి పాటదారుడు తనకున్న ఆస్తి స్థితిగతులను తెలిపే ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత మండల రెవెన్యూ అధికారి వద్ద పొంది పాట సమయంలో కార్యనిర్వహణాధికారికి దాఖలు పరచాలని తెలిపారు పాటదారుడు సబ్‌లీజులు ట్రాన్స్‌ఫర్లు చేయడానికి వీలులేదన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు దేవాలయం వద్దకు వచ్చి పాల్గొనాలని ఈఓ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంను ప్రారంభించిన అనంతరం పూర్వ విద్యార్థులతో మారం వెంకారెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా వేసవి కాలంలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చేస్తున్న కృషిని మారం వెంకారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన నల్లూరి శ్రీనివాసరావు, గొల్లపూడి వెంకట్రావు, ముక్కెర ఏడుకొండలు, తాటికొండ వెంకట సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నందిగంను కలిసిన గంగిరెడ్డి



ఎంపీ నందిగం సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ గంగిరెడ్డి

చీమకుర్తి: బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ గంగిరెడ్డి సుందరరామిరెడ్డి ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో గంగిరెడ్డి సుందరరామిరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్లు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి పాల పొంగళ్ల వేడుక ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు సమర్పించేందుకు పట్టణంలోని మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోడిపందెం జూదరుల అరెస్ట్



పట్టుబడిన వారితో ఎస్‌ఈబీ అధికారులు

ముండ్లమూరు: మండలంలోని తమ్మలూరు గ్రామ సమీపంలో ఆదివారం కోడిపందాల స్థావరంపై దర్శి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు దాడి చేశారు. గ్రామ శివారు ప్రాంతం చిలకలేరు వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్‌ఈబి సీఐ బి. సుందరరామయ్య తెలిపారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి ఆరు కోళ్లు, పది పందెం కోడి కత్తులు, 8460 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను దర్శి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పక్కాగా మోడల్ కోడ్ అమలు

- ఒంగోలు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు
- పోలీసు బందోబస్తు సిద్ధం
- విలేకర్ల సమావేశంలో ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి



ఒంగోలు అర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడులైన నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఒంగోలు నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విధిగా అమలు చేస్తున్నామని ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై మే 13వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. అందుకోసం ఒంగోలు తహసీల్దార్, ఓఎంసీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, కలెక్టరేట్ విభాగాల్లోని ఇద్దరు తహసీల్దార్లు ఒంగోలు నియోజకవర్గం ఆర్ఓ వద్ద ఏఆర్ఓలుగా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 259 పోలింగ్ కేంద్రాలను అన్ని విధాలుగా సిద్ధం చేశామన్నారు. రావ్ అండ్ నాయుడు కాలేజీలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఉంటుందన్నారు. మొత్తం ప్రక్రియలకు సంబంధించి పోలీసు బందోబస్తు కూడా సిద్ధం చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే సెక్టోరల్, నోడల్,, రూట్ ఆఫీసర్లతో పాటు అందరికీ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లు, అవసరమైన వారికి శిక్షణ, మాస్టర్ ట్రైనింగ్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా 85 ఏళ్ల వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో మొత్తం 2,38,384 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుష ఓటర్లు 1,14,640 మంది, మహిళా ఓటర్లు 1,23,695 మంది, థర్డ్ జెండర్ 49 మంది ఉన్నట్లు ఆర్డీఓ తెలిపారు.

గ్రామీణ వైద్యులకు అండగా ఉంటా

- ఆత్మీయ సమావేశంలో శివప్రసాద రెడ్డి



బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

దర్శి: వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు తక్కువ ఫీజుతో వైద్య సేవలందించే గ్రామీణ వైద్యులకు అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ లక్ష్మీశ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివార దర్శి డివిజన్ ప్రజా వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులతో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి శివప్రసాద రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించటం డాక్టర్‌గా ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుతున్న గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వచ్చే బాధలు తమ బాధల్లా ఫీలై వారు త్వరగా కోలుకోవాలని, తమకు చేతనైనంత అనుభవంతో కూడిన వైద్య సేవలందించటమే కాకుండా పెద్ద జబ్బులను సైతం సంబంధిత ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యచికిత్సలు చేయిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలు గురించి కొనియాడారు. రాష్ట్రంలో ఒక్క రూపాయి డాక్టర్ అనగానే గుర్తుకు వచ్చేది వైఎస్ రాజశేఖర రెడ్డి మాత్రమే అన్నారు. అందువలన ఆయన 108, 104, ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ పేదవారైనా ప్రాణాపాయ స్థితిలో ఉండి అన్నా అంటే అక్కున చేర్చుకుని అన్ని విధాలా ఆదుకుని వైద్యచికిత్సలు చేయించి వారి ముఖాల్లో ఆనందం చూస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అన్నారు. బూచేపల్లి కుటుంబం గత 25 సంవత్సరాలుగా జిల్లాలో అంబులెన్సు సౌకర్యం, మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య సేవలందించినట్లు తెలిపారు. దివంగత దర్శి మాజీ శాసన సభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యసేవలను అందించారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గ్రామీణ వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారని, ఆతరువాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం దానిని రద్దుచేసి గ్రామీణ వైద్యులను రోడ్డున పడేసిందని, తిరిగి గ్రామీణ వైద్యులకు శిక్షణ కార్యక్రమం కొనసాగించాలని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ఇప్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మోటాటి కృష్ణారెడ్డి కోరారు. రాబోయే ఎన్నికల్లో దర్శి నియోజకవర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డికి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి ఫ్యాను గుర్తు పైఓట్లు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, దాని ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. సంఘం సమస్యలు ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని శివప్రసాదరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజావైద్యుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు, దర్శి డివిజన్ నాయకులు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గ్రామీణ వైద్యులు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

- ఆహ్వానించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాంబాబు, పక్కన చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని 18వ బ్లాక్‌కు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే తన దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీలో చేరిన గోకుల కాలనీకి చెందిన ఏరువ శ్రీనివాసులు, ఆదినారాయణ, గోవింద్ తదితరులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పలువురు మద్దతు



బుర్రాకు మద్దతు తెలుపుతున్న జానపద కళాకారుడు కిన్నె బ్రహ్మయ్య తదితరులు

కందుకూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. ఆదివారం పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కలిసి మద్దతు తెలిపారు. లింగసముద్రం మండలం వీరరాఘవుని కోట గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, పల్నాటి వీరచరిత్ర కథకుడు, తెలంగాణ రాష్ట్ర జానపద పురస్కార గ్రహీత కిన్నెర బ్రహ్మయ్య బుర్రాను కలిసి తన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం కళాకారులను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. బ్రహ్మయ్యతో పాటు కిన్నెర నరశింహ, బి వెంకటేశ్వర్లు, సవలం జోజయ్య, శింగయ్య, కిన్నెర శింగయ్య, కేశవులు, హరిచంద్ర, దారంశెట్టి హరిగుప్తా, దారంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిశోర్, హుస్సేన్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉలవపాడు మండలం చాకిచర్ల గ్రామ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఆవుల జయరాం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్న సోమయ్య, చిన్న ఏడుకొండలు, రవి, రాము, పేర్ల శ్రీను, రెడ్డిపాలెం యూత్ బుర్రాను కలిసి మద్దతు తెలిపారు.

వేగంగా షాదీఖానా నిర్మాణం

- ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా



ఎమ్మెల్యే రాంబాబు, షంషేర్‌ను సన్మానిస్తున్న షాదీఖానా కమిటీ సభ్యులు

మార్కాపురం రూరల్: మార్కాపురం ప్రాంత ముస్లింల చిరకాల స్వప్నమైన షాదీఖానాను వేగంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం షాదీఖానా శ్లాబ్ నిర్మాణాన్ని పురస్కరించుకుని ఆయన పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక దువా చేశారు. ఏడాది క్రితమే పనులు ప్రారంభం కాగా సాంకేతిక కారణాల వల్ల నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయడంతో నెల రోజుల నుంచి పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రత్యేక దువాలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, డాక్టర్ మగ్బుల్‌బాషా, నజీర్ అహ్మద్, కౌన్సిలర్ సలీం, షాదీఖానా కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, కరీముల్లా, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు దీవించండి



సంక్షేమ లబ్ధి కరపత్రాలు అందజేస్తున్న కృష్ణ చైతన్య

పొదిలి రూరల్: నవరత్నాలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు దీవించాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నావెంకట రాంబాబు తనయుడు అన్నా కృష్ణ చైతన్య కోరారు. ఆదివారం పొదిలి నగర పంచాయతీలోని 7, 8వ వార్డుల్లో నవాబుమిట్ట, మసీదుతోటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత బేదం లేకుండా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు దీవించాలని ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కల్లం సుబ్బారెడ్డి, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షుడు గుజ్జుల రమణారెడ్డి, కార్యదర్శి కొత్తపులి బ్రహ్మరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, సంయుక్త కార్యదర్శి మందలపు శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసులు, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, వాణిజ్య విభాగం కార్యదర్శి యక్కలి శేషగిరిరావు, మాజీ ఎంపీపీ నరసింహారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, గూడూరి వినోద్, మాబాషా, ముల్లాహసన్‌వలి, పి.శ్రీనివాసరావు, జాకీర్, ఫిరోజ్, సింగారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వల్లూరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చన చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ సుబ్బారావు, అర్చకులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలేరమ్మకు విశేష పూజలు

జరుగుమల్లి: ప్రసిద్ధిగాంచిన కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం పోలేరమ్మను ఆలయ అర్చకులు శ్రీధర శ్రీనివాసశర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కుంకమ పూజ, గోత్ర నామార్చనలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిరుపేదలకు ఉచితంగా సంతాన సాఫల్య చికిత్స



డాక్టర్ శైలజ

ఒంగోలు టౌన్: సంతానం లేక బాధపడుతూ ఆధునిక చికిత్స చేయించుకునే స్తోమత లేని నిరుపేద దంపతులకు ఉచితంగా చికిత్స చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్ జె.శైలజ తెలిపారు. ఆదివారం నగరంలోని కర్నూలు రోడ్డులో మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో దుర్గా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఆధ్వర్యంలో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ ప్రసంగిస్తూ రానురాను సంతాన సాఫల్య సమస్య పెరిగిపోతోందని, మొబైల్ ఫోన్ ఎక్కువగా వినియోగించడం, జంక్ ఫుడ్ తినడం, బరువు పెరగడం, మానసిక ఒత్తిడి లాంటి జీవనశైలి మార్పుల వలన దంపతులలో పిల్లలు కలగడం లేదన్నారు. దాదాపు 95 శాతం మందికి చిన్నపాటి వైద్యం చేస్తే సరిపోతుందన్నారు. కేవలం 1 నుంచి 5 శాతం మందికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స అవసరమవుతుందన్నారు. ఇప్పటి వరకు తమ వైద్యశాలలో 200 మందికి పైగా దంపతులకు ఐవీఎఫ్ ద్వారా సంతానం కలిగిందని, నేషనల్ సక్సెస్ రేట్ కంటే ఎక్కువగా 63 శాతం సాధించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సుష్మిత, పీఆర్ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేస్తున్న గిరిబాబు

చీమకుర్తి: చీమకుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బండ్లమూడి, పల్లామల్లి, దేవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు గోల్డెన్ గ్రానైట్ జీఎం ఏ గిరిబాబు చేతుల మీదుగా ఆదివారం రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్యాడ్లతో పాటు పెన్నులు అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురికి బూచేపల్లి ఆర్థిక సాయం



రాయపూడి వెంకటయ్యకు ఆర్థిక సహాయం అందజేసి వివరాలు తెలుసుకుంటున్న బూచేపల్లి శివప్రసాద రెడ్డి

ముండ్లమూరు: మండలంలోని రమనారెడ్డిపాలెం, వేములబండలో ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపూడి వెంకయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. వేములబండ గ్రామానికి చెందిన నల్లూరి సామేలు ప్రమాదంలో గాయపడగా అతనికి పది వేలు అందించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామన్నారు. నాయకులు నూకతోటి మధు, కోడూరి శ్రీను, గోపనబోయిన అంకాలు, దార్ల వెంకటరావు, దార్ల నాగయ్య పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి లక్ష్మానాయక్




వసతి గృహ విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారి లక్ష్మానాయక్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఎస్సీ వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సంక్షేమ వసతి గృహ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్.లక్ష్మానాయక్ కోరారు. జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహ అధికారులతో, విద్యార్థులతో ఆదివారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో సమావేశమై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 60 వసతి గృహాల్లో 889 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, అందులో బాలురు 633 మంది, బాలికలు 256 మంది ఉన్నారని అన్నారు. ఇప్పటికే అందరికీ ట్యూటర్స్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు గ్రేడ్లు చేసి తగిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థుల ఉన్నతికి రాష్ట్ర డైరెక్టర్ విజయ్ క్రిష్ణన్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులు పరీక్షల హాల్‌లో ప్రశాంతంగా ఆలోచించి పరీక్షలు రాయాలని చెప్పారు. విద్యార్థులకు మొదటి మెట్టు పది అని, అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రిపరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రుల కష్టం గుర్తుకు రావాలని సూచించారు. నూటికి నూరు శాతం పాస్ కావాలని అందరికీ విజయోస్తు అని దీవించారు. జూమ్ సమావేశంలో లాప్‌టాప్‌ల ద్వారా ప్రతి వసతి గృహం సంక్షేమ అధికారి, వసతి గృహం పదో తరగతి విద్యార్థితో ప్రత్యేకంగా మాట్లాడి వారికి తగిన సూచనలు చేశారు.

ఏప్రిల్ 14న అంబేడ్కర్ భవన్‌లో జయంతి మేళా

ఒంగోలు టౌన్: ఏప్రిల్ 14వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్వహించే బాబా సాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే, జగ్జీవన్‌రామ్ జయంతి మేళాను జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పిలుపునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి రోజున ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఎం కళాశాల దగ్గర నుంచి అంబేడ్కర్ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 500 మంది వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిమాల సంపత్‌కుమార్, కులాంతర వివాహాల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్, దళిత కళామండలి కన్వీనర్ వి.సురేష్, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మేడికొండ విద్యాసాగర్, ప్రియతం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చప్పిడి వెంగళరావు

ప్రకటన

నా క్లైంట్స్ 1) V.శివకృష్ణ సాయి, 2) V.రాజశేఖర తిరుమల సాయి, ఒంగోలు అమవారి సంతాయిన్ మేరకు యావన్మందికి తెలియజేయనది.

నా క్లైంట్స్ 269.1/9 Sq.yards of Site in Sy.219 ఒంగోలును Original Sale deed Dt.10.12.2020 D.No.8956/2020 ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లైయింట్స్ 12.2.2024 తేదిన పై Original Sale Deed తో పాటు Original Link Documents 833/2001, 5738/1995, 5737/1995, 1678/1980, 1679/1980, తీసుకొని అంజయ్యరోడ్డులో Auto ఎక్కి సమతానగర్‌లోని వారి Siteకు పోయి చూసుకొని తిరిగి యింటికి వచ్చి చూసుకొనగా Original Register Sale Deed D.No.1678/1980 పోయినది. ఈ రోజు వరకు ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన యెడల క్రింది అడ్రసుకు వెంటనే తెలుపవలెను.

తేది:17.03.2024

Maddali Sridhar, B.A., B.L.
Advocate, Ongole.
Cel:95818 28277

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

ఒంగోలు డివిజన్

90102 24456 90103 57744
90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com